# ఇస్కాన్ క్రమానుగత యాజమాన్యం గూర్చి అవగాహన

## చారిత్రాత్మిక వివరణ:

ఇస్కాన్ క్రమానుగత యాజమాన్యం గూర్చి అవగాహన: కొద్ది సంవత్సరాల క్రితం గవర్నింగ్ బాడీ కమీషన్ జి.బి.సి ఇస్కాన్ యొక్క భవిష్యత్ కోసం ఒక క్రమబద్ధమైన ప్రణాళిక సిద్ధం చేసింది. మన ఉద్యమానికి అత్యంత ముఖ్యమైన అనేక ప్రధానాంశాలను గుర్తించి వాటిని చర్చించడం కోసం కొన్ని సమితులు ఏర్పాటు చేసింది. అందులో ఒకానొక సమితికి ఇస్కాన్‌లో వివిధ యాజమాన్యాల మధ్య విభేదాలను అధ్యయనం చేసి వారి మధ్య సమన్వయం తీసుకునివచ్చే బాధ్యతను అప్పగించారు. ఆ సమితిలో పరమ పూజ్య భాను స్వామి, పరమ పూజ్య గురుప్రసాద స్వామి, పరమ పూజ్య ప్రహ్లాదానంద స్వామి, పరమ పూజ్య రమయి స్వామి, పరమ పూజ్య శివరామ స్వామి, పూజ్యశ్రీ బద్రినారాయణ దాస మరియు పరమ పూజ్య నిరంజన స్వామి మొదలగు వారు సభ్యులుగా ఉన్నారు.

## ముఖ్యాంశం:

ఈ అంశం ప్రత్యేకించి దీక్షా గురువు, శిక్షా గురువు, వారి శిష్యులు, కేంద్రీయ జి.బి.సి సభ్యులు, ప్రాంతీయ కార్యదర్శులు, మందిర అధ్యక్షులు మరియు ఇస్కాన్ అధికారిక కార్యనిర్వాహకులు మొదలుగు వారందరూ అనుసరించవలసిన సూత్రములను రూపొందించుటకు ఉద్దేశించబడింది. ముఖ్య లక్ష్యమేమనగా ఆధ్యాత్మిక గురువులకు, కార్యనిర్వాహకులకు మధ్య ఉన్న దురవగాహనలను నిర్మూలించుట మరియు ఆ దురవగాహనల వల్ల వారిరువురి ఉమ్మడి పర్యవేక్షణలో ఉన్న భక్తులపై పడే శక్తివంతమైన ప్రభావమును తగ్గించుట.

## దీక్షా గురువు మరియు శిక్షా గురువు ఇరువురును ఆధ్యాత్మిక గురువులే :

ఇప్పటి నుండి ఇస్కాన్‌లో గుర్తించవలసిన విషయమేమనగా ప్రత్యేకించి నిర్ధేశించితే తప్ప, మనం ఎప్పుడైనా ఆధ్యాత్మిక గురువు అనే పదాన్ని వాడితే అది దీక్షా గురువుకు మరియు శిక్షా గురువుకు (శిక్షా గురువుగా వర్తిస్తున్న కార్యనిర్వాహకులకు కూడా) ఇరువురికి వర్తిస్తుంది. అంతేగాక మనం ఎప్పుడైనా “ఆధ్యాత్మిక యాజమాన్యం” అనే పదాన్ని ఉపయోగిస్తే అది, ఎవరి ఆదర్శప్రాయ శిక్షణ వల్ల భక్తునికి భక్తియుక్త సేవ యందు విశ్వాస పునాదులు ఏర్పడ్డాయో మరియు ఎవరి ప్రోత్సాహం వల్ల భక్తియుక్త సేవ యందలి విశ్వాసం కొనసాగుతుందో అటువంటి దీక్షా గురువుకు గాని లేక కార్యనిర్వాహకులకు గాని వర్తిస్తుంది.

## ఇస్కాన్ యందలి యాజమాన్యం :

ఆధ్యాత్మిక గురువు కలిగియుండవలసిన లక్షణములను, నిర్వర్తించవలసిన బాధ్యతలను మరియు ఆధ్యాత్మిక గురువును ఎంపిక చేసుకునే విధానమును గురుతత్త్వం అంటారు. అయితే ఈ వ్యాసము అటువంటి గురుతత్త్వమును గాని లేక ఇస్కాన్ కార్యనిర్వహణ పద్ధతి గురించిగాని పూర్తిగా విశదీకరించే పరిశీలన కాదు.

ఈ వ్యాసము నందలి ప్రధానాంశము ఏమనగా ఒక భక్తుడు దీక్షా గురువైనా, శిక్షా గురువైనా, సన్యాసి అయినా, జి.బి.సి సభ్యుడైనా, కేంద్రీయ కార్యదర్శియైనా, ప్రాంతీయ కార్యదర్శియైనా, మందిర అధ్యక్షుడైనా, గృహస్థ ప్రచార నాయకుడైనా లేక ఇస్కాన్‌లో ఉన్న ఏ అధిపతియైనా అతనికి అప్పగించబడిన అధికారం ఎప్పుడు పరిపూర్ణమవుతుందంటే అతడు లేక ఆమె ఇస్కాన్ ఉద్యమానికి జి.బి.సి సంపూర్ణ అధికార పర్యవేక్షణలో సేవ చేయుట కొరకు శ్రీల ప్రభుపాదుల వారి సూచనలను పాటించినప్పుడు మాత్రమే. ఈ విషయాన్ని సాధించడానికి శ్రీల ప్రభుపాదులవారు స్పష్టంగా మరియు స్థిరంగా వారి ఉపదేశాలలో ఇచ్చిన సూత్రాలను అదేవిధంగా తన చేవ్రాలచే వ్రాసిన అధికారిక దస్తావేజులను మనం పదేపదే ప్రాధాన్యతనిచ్చి గుర్తు చేసుకుంటే చాలు మరింకేమీ అవసరం లేదు. శ్రీల ప్రభుపాదులవారు సంపూర్ణ జి.బి.సి ని పరిపూర్ణ కార్యనిర్వాహక యాజమాన్యం అని స్పష్టంగా రూపొందించారు. మరియు సంపూర్ణ జి.బి.సి యాజమాన్యం పరిధి అంటే అవసరమైనప్పుడు యావత్ ఇస్కాన్‌కు మరియు ఇస్కాన్‌లో ఆధ్యాత్మిక గురువులుగా సేవ చేస్తున్న భక్తులకు కూడా అవసరమైనప్పుడు ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం చేయవలసి వుంటుంది.

**విలేఖరి:** స్వామీజీ! మీ తర్వాత ఈ ఉద్యమానికి ప్రధాన ప్రచారకుడిని ఎవరినైనా మీరు నిర్దేశించారా?

**శ్రీల ప్రభుపాదులు:** అవును, నేను పరిపక్వం చెందిన కొద్దిమంది శిష్యులకు శిక్షణ ఇస్తున్నాను. వారిని జి.బి.సి సభ్యులుగా చేశాను. వారు ముందుండి సులభంగా ఈ ఉద్యమ బాధ్యతలను స్వీకరిస్తారు

*(లాస్ ఎంజెల్స్‌లో జూన్ 4, 1976 తేదీన విలేఖరితో రూములో సంభాషణ).*

దీని అర్థం ఏమనగా సంపూర్ణ జి.బి.సి ఇస్కాన్‌లో పరిపూర్ణ కార్యనిర్వహణ యాజమాన్యం అయినప్పటికి జి.బి.సి సభ్యుల యొక్క బాధ్యత కేవలం కార్యనిర్వహణ చేయడం మాత్రమే కాదు బోధించడం కూడా అని తెలుస్తుంది.

## రెండు విధాలైన యాజమాన్యాలు :

ఇస్కాన్‌లో ప్రతిఒక్క భక్తుడు కూడా తమ ఆధ్యాత్మిక ప్రేరణను రెండు విధాలైన యాజమాన్యాల నుండి లేదా వారి ప్రతినిధుల నుండి పొందుచున్నాడు. ఇందులో ఒక యాజమాన్యం ఆధ్యాత్మిక ప్రధానముగా కనిపించగా, మరొక యాజమాన్యం కార్యనిర్వాహణ ప్రధానముగా కనిపిస్తుంది. కాని రెండు యాజమాన్యాలు కూడా వాటి వాటి విశిష్ఠతను కలిగియుండి పరస్పర సహకార ప్రయోజనాలతో ప్రభుపాదుల వారి (సంస్థాపకాచార్యులు) ఆజ్ఞకు లోబడే యున్నాయి. రెండు యాజమాన్యాలు కూడా వారి వారి పరిరక్షణలో భక్తులకు ఆశ్రయమునిచ్చుటకు సంపూర్ణ జి.బి.సి చేత అధికారికముగా ఆమోదింపబడ్డాయి. ఉపదేశము ద్వారా మరియు ఆదర్శ ప్రవర్తన ద్వారా

ఈ ఆశ్రయమునివ్వవచ్చును. అయితే ఇస్కాన్‌లోని ఆధ్యాత్మిక యాజమాన్యాన్ని రెండు విధాలైన యాజమాన్యాలుగా వర్గీకరించబడడమనేది జరిగింది. మొదటిది ఆధ్యాత్మిక ప్రధానము కాగా, రెండవది కార్యనిర్వాహణ ప్రధానముగా కలిగియున్నది. అయితే కార్యనిర్వాహణ యాజమాన్యమనేది ఆధ్యాత్మిక యాజమాన్యమునకు విరుద్ధమని మేము చెప్పడము లేదు. అలాఅని ఆధ్యాత్మిక యాజమాన్యము కార్యనిర్వాహక యాజమాన్యము కన్నా మరింత ప్రయోజనకరమని గాని, అత్యంత పవిత్రమని గాని మేము చెప్పడం లేదు.

''కార్యనిర్వాహణము కూడా ఆధ్యాత్మిక కార్యక్రమమే. ఎందుకనగా ఇది శ్రీకృష్ణుని యొక్క సంస్థాపన"(కలకత్తాలో జనవరి **16, 1977** తేదీన జరిగిన సంభాషణ).

"మన ప్రచార కార్యక్రమాలలో మనం ఎక్కువగా సంపదలు, ధనము, ఎన్నో పుస్తకాల అమ్మకము కొనుగోలుల వంటి కార్యక్రమాలతో వ్యవహరిస్తూ ఉంటాము. మరి ఈ వ్యవహారాలన్నీ కృష్ణచైతన్య ఉద్యమానికి సంబందించినవి కనుక వీటిని భౌతికముగా భావించరాదు. కనుక ఎవరైనా ఆ విధమైన కార్యనిర్వాహణ యందు ఆలోచనలో నిమగ్నమై ఉంటే దానర్థం వారు కృష్ణ చైతన్యానికి బాహ్యముగా నున్నారని కాదు. ఎవరైనప్పటికి దైనందిన నియమనిబంధనలు పాటిస్తూ రోజుకు పదహారు మాలలు జపం చేస్తున్నట్లైతే కృష్ణచైతన్యాభివృద్ధి కోసము వారు ఈ భౌతిక జగత్తులో కొనసాగించే వ్యవహారాలు కృష్ణచైతన్యములో ఆధ్యాత్మికాభివృద్ధికి అభిన్నమైనవి" (శ్రీమద్భాగవతము **5.16.3** భాష్యము).

ఆధ్యాత్మిక సంస్థలో కార్యనిర్వాహకుడు లేదా కార్యనిర్వాహకురాలు కేవలం నియమనిబంధనలను ప్రకటించడం మరియు ఆజ్ఞాపించడం ద్వారా తమ బాధ్యతలు పూర్తి చేయలేరు. పద్ధతేమనగా ఆ విధించే నియమనిబంధనలకు ఆధ్యాత్మిక పునాదులు వేసి, వాటిని అమలుపరిచేటపుడు వైష్ణవ సూత్రములతో తప్పక అనుసంధానము చేసే ఆచరింపచేయాలి. ఏవరైతే కార్యనిర్వాహకులు ఈ అవగాహనతో బాధ్యతలు నిర్వహిస్తారో వారు తమ ఆశ్రయములో ఉన్నవారందరి యొక్క సంపూర్ణ ఆధ్యాత్మిక బాధ్యతను స్వీకరించువారౌవుతారు. అందుచేత మనము ఆధ్యాత్మికతకు మరియు కార్యనిర్వాహణకు మధ్యనున్న ఏకత్వాన్ని గమనించాలి. కాని అదేసమయంలో కొంత భిన్నత్వము కూడా ఉంది. ఏకకాలంలో ఉండే ఈ ఏకభిన్నత్వములను అవగాహన చేసుకోవాలంటే ముందు ఈ రెండు పదాలను విశదీకరించి అర్థము చేసుకోవలెను.

## ఆధ్యాత్మిక యాజమాన్యము :

ఈ ఆధ్యాత్మిక యాజమాన్యమనేది దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని నుండి ప్రారంభమై బ్రహ్మ, నారద, వ్యాసులతో కొనసాగుతూ మన సంస్థాపకాచార్యులైన శ్రీల ప్రభుపాదులవారి ద్వారా మనకు అందుతూ ఉంది. ఏవరైతే మన సాంప్రదాయానికి విధేయులైయుండి సంపూర్ణ జి.బి.సి యాజమాన్యానికి లోబడి ఉంటారో వారు ఇస్కాన్ ఆధ్వర్యములో భక్తులకి ఆధ్యాత్మిక ఆశ్రయమును ఇవ్వడానికి ప్రామాణికముగా ఆమోదింపబడతారు. అయితే జి.బి.సి సభ్యులు, కేంద్రీయ, ప్రాంతీయ కార్యదర్శులు, ఆధ్యాత్మిక గురువులు(దీక్షాగురువులు), సన్యాసులు, మందిరాధ్యక్షులు, భక్తివృక్ష నాయకులు(నామహట్ట అధిపతులు), నామహట్టప్రచారకులు మరియు సంచార ప్రచారుకులు మొదలగువారు ఈ ఆధ్యాత్మిక యాజమాన్యము కోవలోనికే వస్తారు. వాస్తవానికి ఆచార ప్రచారాల

ద్వారా ఎవరైతే ఆధ్యాత్మిక గురువులను నిర్థిష్ఠముగా అనుసరిస్తున్నారో వారు ఆధ్యాత్మిక యాజమాన్యముగా ప్రాతినిధ్యము వహించదానికి అర్హులైయున్నారు.

సామాన్య అర్థములో చెప్పాలంటే భక్తుని యొక్క దీక్షాగురువు లేదా శిక్షాగురువు అత్యంత ప్రధాన ఆధ్యాత్మిక యాజమాన్యమైయున్నారు. భక్తులు తమ ఆధ్యాత్మిక గురువులకు సదా విధేయులైయుండాలని శాస్త్రం స్పష్టముగా చెప్పుచున్నది. అందుచేతనే ఆధ్యాత్మిక గురువులు తమ శిష్యులకు ఆధిపత్యము వహించి తద్వారా వారి భక్తి వృద్ధి చెందుటకు అవసరమైన శిక్షణ, జ్ఞాన బోధనచేయగలుగుతారు. ఈ విధముగా ఆధ్యాత్మిక గురువులు తమ శిష్యులు కృష్ణచైతన్యములో పురోభివృద్ధి సాధించుటకు అవసరమైన ప్రేరణ మరియు ఆధ్యాత్మిక జ్ఞానములను ఇచ్చుటలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు.

## కార్యనిర్వాహక యాజమాన్యము :

శ్రీల ప్రభుపాదులవారి యొక్క సూచనలు ననుసరించి సంపూర్ణ జి.బి.సి నుండి ప్రతిపాదింపబడే నియమనిబంధనలు నిర్వర్తింపజేస్తూ ఇస్కాన్ సంస్థను పర్యవేక్షించే ప్రతినిధి సమూహాన్ని కార్యనిర్వాహక యాజమాన్యమంటారు. కార్యనిర్వాహణ వ్యవస్థకు సంబంధించి "యాజమాన్యము" అనే పదమును మనము ప్రయోగించినపుడు దానర్థం అచింత్యమైన పరిపూర్ణమైన యాజమాన్యమని కాదు, కేవలం ప్రచార ఉద్యమాన్ని శ్రీల ప్రభుపాదులవారి సూచనలతో అనుసంధానము చేసి నిర్వహించే యాజమాన్యం మాత్రమే. అదే శాస్త్రప్రమాణాన్నైతే అచింత్యమైన, పరిపూర్ణమైన యాజమాన్యమని పిలువచ్చును. అటువంటి అధికారిక ఆజ్ఞను శాస్త్రప్రమాణం నేరవేర్చడానికి శ్రీల ప్రభుపాదులవారిచే ఇవ్వబడినటువంటి ఇస్కాన్ కార్యనిర్వాహక వ్యవస్థను వారి శిష్యులు ప్రవేశపెట్టారు. ఈ కార్యనిర్వాహక వ్యవస్థ ద్వారా మందిరాభివృద్ధి, గృహస్థ భక్తులు(ఆశ్రమవాసులు కానివారు లేదా మందిరములో నివసించనివారు) మరియు వ్యవసాయ క్షేత్రాలు, గురుకుల పాఠశాలలు వంటి ఇతర అనేక ప్రణాళికలను, పథకాలను పోషించడం జరుగుతుంది. అందుచేత వ్యాపిస్తున్న ఈ ప్రచార రంగానికి మరియు దీని సభ్యులకు శ్రేష్ఠమైన సేవలు అందించడానికిగాను ప్రస్తుతం ఈ కార్యనిర్వాహక వ్యవస్థయందు ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ జి.బి.సి సభ్యులు, కేంద్రీయ కార్యదర్శులు, ఆధ్యాత్మిక గురువులు, సన్యాసులు, ప్రాంతీయ కార్యదర్శులు, మందిరాధ్యక్షులు, నామహట్ట, (భక్తివృక్ష) అధిపతులు, నామహట్ట ప్రచారకులు మరియు సంచార ప్రచారకులు కూడా ఉన్నారు.

## పరస్పర భిన్నత్వము గురించి వివరణ :

మన ఇస్కాన్‌లో ప్రతిదీ కూడా శ్రీల ప్రభుపాదులవారి దృష్టిని అనుసరించి చేయడమనేది ఆదర్శప్రాయమే, కాని ప్రత్యక్షముగా మనం చూచినదేమనగా ఒక యాజమాన్యము(ఆధ్యాత్మిక) ఇంకొక యాజమాన్యముతో(కార్యనిర్వాహక) విబేధించడం కనబడుతుంది. ఉదాహరణకు ఆధ్యాత్మిక యాజమాన్యమువారు కొన్నిసార్లు బాధ్యతాయుతమైన కార్యనిర్వాహకుల విషయములో జోక్యము చేసుకొంటుంటారు. వారు తాము కూడా ఆ ప్రాంతీయ కార్యనిర్వాహక వ్యవస్థలో భాగస్వాములమేన్న విషయం పరిగణించరు (ఎక్కడైతే వారి ప్రచారము

జరుగుతుంటుందో). కాని వారు ప్రత్యక్షముగా లేదా పరోక్షముగా అదే కార్యనిర్వాహక వ్యవస్థలో కొన్ని ప్రణాళికలను నిర్వహిస్తూ ఉంటారు.

ఈ విధముగా కొన్నిసార్లు ఆధ్యాత్మిక యాజమాన్యమువారు తాము ప్రచారము చేస్తున్న ప్రాంతములోనుండే కార్యనిర్వాహక వ్యవస్థతో ఏవిధమైన ఒప్పందము లేకుండానే భక్తులను, ధనాన్ని, కొన్ని విధాలైన ప్రణాళికలను పోషిస్తూ వాటికి తమ అనుచరులను లేదా ఆశ్రితులను(ఆశ్రితులనగా కేవలం ఆధ్యాత్మికముగా ఆశ్రియించినవారే కాదు. కొన్ని సందర్భాలలో భక్తులు తమ ఆధ్యాత్మిక యాజమాన్యముపై ఆర్థికముగా కూడా ఆధారపడతారు. అలా ఆధారపడినవారి ఆర్థికావసరాలు ఆ యా ఆధ్యాత్మిక యాజమాన్యాలువారు సొంతంగా ఏర్పాటు చేసుకొన్న వ్యవస్థల ద్వారా తీరుతూ ఉంటాయి) బాధ్యులుగా నియమిస్తారు. ఈ విధముగా చేయుడం వలన వారు తమ అనుచరుల సేవను కార్యనిర్వాహక వ్యవస్థ నుండి దారిమళ్ళించి తద్వారా అనుచరుల యొక్క విధేయతను, బాధ్యతను కూడా దారిమళ్ళించినట్లు అవుతుంది. ఇలా చేయుడం వలన కార్యనిర్వాహక యాజమాన్యమును తిరస్కరించినట్లు అవుతుంది.

ఈ రకమైన సన్నివేశము అయోమయ పరిస్థితినే గాక వేర్పాటు భావమును కూడా కలిగిస్తుంది. ఇలాంటి సందర్భాలు కార్యనిర్వాహకులకు వివాదస్పద అంశాలుగా తయారౌతాయి. కొన్నిసార్లు చిన్న కార్యనిర్వాహకులు ప్రత్యక్షముగా ఈ విషయములో తాము అనుభవిస్తున్న బాధలను అపరాధాలు చేస్తామనే భయముతో (ముఖ్యముగా ఆధ్యాత్మిక గురువులకు) ఎవరికీ పైకి చెప్పుకోలేకుండా ఉంటారు.

మరొక వైపు గమనిస్తే కొంతమంది కార్యనిర్వాహకులు కూడా కొన్నిసార్లు భక్తులకు కావలసినంత ఆధ్యాత్మిక పరిరక్షణను సమకూర్చరు. ఈ కారణం వలనే ఆధ్యాత్మిక గురువులు శిష్యుల విషయములో జోక్యము చేసుకొని వారికి తగిన సేవ, సాంగత్యములను సూచిస్తు ఉంటారు.

ఉదాహరణకు కొన్నిసార్లు కార్యనిర్వాహకులు సాధనకు, పవిత్ర ప్రచారానికి తమను ఆశ్రయించినవారి యొక్క భక్తియుత సేవలలో పవిత్రాభివృద్ధికి ప్రాధాన్యతను ఇవ్వకుండా, వాటికన్నా కార్యనిర్వాహక లక్ష్యాలు, వివిధ ప్రణాళికల పట్ల ప్రాధాన్యత చూపిస్తూ ఉంటారు. ఒక్కొక్కసారి కార్యనిర్వాహకులు తమ పరిధిలో ఉంటూ తమ కార్యనిర్వాహణలో ఏ విధమైన సహాయము గాని, సహాయాధారముగాని చూపనటువంటి భక్తుల ఆధ్యాత్మికాభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకొనక నిర్లక్ష్యము చేస్తారు. అయితే ఆ భక్తుల నుండి సహాయము పొందదానికి కార్యనిర్వాహకులు ఏదో కొంత ప్రేరణ ఇచ్చినప్పటికీ లేక ఇతర యాజమాన్యాన్ని ఆ ప్రేరణ ఇవ్వదానికి ప్రేరేపించినప్పటికీ, తుదకు తమ కార్యనిర్వాహణలో సహాయపడనివారిని నిర్లక్ష్యము చేస్తారు.

## కార్యనిర్వాహక యాజమాన్యము :

పైన పేర్కొన్న సందర్భాల వలన కార్యనిర్వాహక మరియు ఆధ్యాత్మిక యాజమాన్యముల నడుమ విభేదములొచ్చే అవకాశముంది.

అయితే కొన్నిసార్లు పరిస్థితుల ప్రభావమును కూడా అర్థంచేసుకోవలసి ఉంటుంది. అది ఎలా అంటే కొన్నిచోట్ల ఆర్థిక స్తోమత బాగా కలిగియున్న భక్తులు స్థానిక కార్యనిర్వాహక వ్యవస్థతో కార్యనిర్వాహణ దృష్ట్యా ఏ సంబంధం లేకుండా ఉంటారు. అయినప్పటికీ ఆ స్థానిక కార్యనిర్వాహణ వ్యవస్థ లేదా యాజమాన్యము ప్రతిఒక్క

భక్తుడిని లేదా ప్రారంభకుని తమ యొక్క కార్యనిర్వాహణ పరిరక్షణలోకి తీసుకొనిరావడంలో ఏవిధమైన ప్రయత్నం చేయలేదని భావించరాదు.

అందుచేత ఇస్కాన్ కార్యనిర్వాకులు చేస్తున్న సేవను గౌరవిస్తూ ఏ ఆధ్యాత్మిక గురువైనా గాని తమ శిష్యులకు ఏదైనా నూతన సంఘాన్ని లేక నూతన సేవను సూచించునపుడు లేక ఇతర కార్యనిర్వాహక నిర్ణయాలలో జోక్యము చేసుకొనేటపుడు గాని ఆ యా శిష్యులు నివస్తున్న ప్రాంతీయ కార్యనిర్వాహక యాజమాన్యము వద్ద ఖచ్చితముగా ఆమోదమును పొందియుండాలి.

శ్రేష్ఠమైన విషయమేమనగా గురుశిష్య సంబంధ ప్రారంభము నుండే ప్రాంతీయ కార్యనిర్వాహకులకు గౌరవాన్నిచ్చే విధంగా శిష్యులకు శిక్షణనివ్వాలి. పలువురు ఇస్కాన్ కార్యనిర్వాహకులు మందిరమును నిర్వహించుట, విగ్రహములను పోషించుట, పుస్తక వితరణ చేయించుట మరియు ప్రభుపాదులవారిచే మనకివ్వబడిన ఇతర ప్రమాణాలను కొనసాగించుట వంటి ముఖ్యమైన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

విగ్రహప్రతిష్ఠ అనగా సర్వుల శుభము కోరి క్రమము తప్పకుండా నిత్యారాధన చేయుడం(**1971** సెప్టెంబర్ **2**వ తేదీన శివానందకు వ్రాసిన ఉత్తరం).

అందుచేత ఆధ్యాత్మిక గురువులు ప్రాంతీయ నాయకులైన కార్యనిర్వాహకులకు సహకరించడం ద్వారా శ్రీల ప్రభుపాదుల వారి ఉద్యమాన్ని ఎలా సేవించాలో తమ శిష్యులకు బోధించాలి.

అయితే దీనర్థం ఆ కార్యనిర్వాహకుడు లేదా కార్యనిర్వాహకురాలు సంపూర్ణ స్వాతంత్ర్యముతో వ్యవహరిస్తూ తమ పరిధిలోనున్న భక్తుల కనీసవసరాలు సైతం నిర్లక్ష్యం చేయమని గాని కాదు లేక తమ శిష్యులను చక్కగా పట్టించుకోండి అని ఆ యా ఆధ్యాత్మిక గురువులు చెప్పే అభిప్రాయాలను తిరస్కరించే అధికార స్వేచ్ఛా ఉన్నదని కూడా కాదు. కార్యనిర్వాహకులందరూ కూడా ఆధ్యాత్మిక గురువుల యొక్క మరియు వారి శిష్యుల యొక్క సూచనలను మరియు అభిప్రాయాలను సునిశితముగా పట్టించుకోవాలి.

ఒకవేళ ప్రాంతీయ కార్యనిర్వాహణ వ్యవస్థలో తమ శిష్యులకు తగినంత ఆధ్యాత్మిక పరిరక్షణ అందడంలేదని ఆధ్యాత్మిక గురువులు కనుక బలంగా భావించినట్లైతే, తమ శిష్యుల పట్ల కార్యనిర్వాహకులు ఏవైతే ఒప్పందం, బాధ్యతలు స్వీకరించారో అవి సరిగా నెరవేర్చడం లేదని అభిప్రాయపడినట్లైతే అపుడు ఆ శిష్యుల తరుపున ఆ ఆధ్యాత్మిక గురువు ఉన్నత కార్యవర్గాలకు గాని లేక ప్రాంతీయ జి.బి.సి సభ్యులకు గాని లేక ఇతర అధికారిక ఇస్కాన్ వ్యవస్థలకు గాని నివేదికను అందించవలెను.

ఈ విషయము గురించి మరింత వివరణ తరువాతి అంశాలలో వివరింపబడినది. కాని దానికి ముందుగా మొదట 'విశ్వాసము' అనే విషయాన్ని సునిశితముగా క్లుప్తముగా చర్చిద్దాం. ఇక్కడ చర్చించబడిన అంశాలలో రెండు విధాలైన యాజమాన్యాలు కూడా విశ్వాసానికి ప్రాతిపదికగా తమ వంతు సేవను కలిగియున్నాయి.

## విశ్వాసము యొక్క నిరంతరాభివృద్ధి వలనే యాజమాన్యము కొనసాగుతుంది :

ఇస్కాన్ యొక్క గొప్ప సంపదేమనగా అందులోని సభ్యుల యొక్క విశ్వాసమే. చివరికి మందిరాలు లేకపోయినప్పటికీ, భారీ ప్రణాళికలు లేకపోయినప్పటికీ, ఆదాయము లేకపోయినప్పటికీ, కొద్దిమంది అనుచరులే ఉన్నప్పటికీ విశ్వాసము ఉన్నట్లైతే ఖచ్చితముగా అచట అసలైన అభివృద్ధి అనేది కనిపిస్తుంది. అసలు విశ్వాసము గురించి ప్రభుపాదులవారు ఏమి చెప్పారో ఈ ఉత్తరములో చూడండి.

" "ఉత్సాహవంతులు అదృష్టదేవత యొక్క అనుగ్రహాన్ని పొందుతారు" అని సంస్కృతములో ఒక సామెత కలదు. పాశ్చాత్య ప్రపంచములో ఈ సామెతకు చాలా నిరూపణ కలదు. పాశ్చాత్య ప్రపంచములోని జనులు భౌతికాభివృద్ధి పట్ల అత్యంత ఉత్సాహమును చూపిస్తారు కనుక దానినే పొందుతారు. అదేవిధముగా రూపగోస్వామి ఉపదేశాల ప్రకారముగా మనము ఆధ్యాత్మిక విషయాలలో ఉత్సాహముగానున్నట్లైతే మనము కూడా ఆ మార్గములో విజయాన్ని సాధించవచ్చును. ఉదాహరణకు నేను మీ దేశానికి పండు ముదుసలి వయసులో వచ్చాను. కాని నా దగ్గర ఒక సంపద ఉండింది. అదేమనగా ఉత్సాహము మరియు నా ఆధ్యాత్మిక గురువు పట్ల విశ్వాసము. నేను అనుకోవడం బహుశా ఆ సంపదే నాకు ఆశాకిరణముగా మారి, మీ సహకారముతో నేను ఇంత సాధించడానికి కారణమైందని భావిస్తున్నాను." (టిటన్‌హర్స్ట్‌లో అక్టోబర్ **15, 1969** తేదీన జయగోవిందకు వ్రాసిన ఉత్తరం).

భగవద్గీత యథాతథము **9.3** శ్లోక భాష్యములో "కృష్ణచైతన్యాభివృద్ధికి విశ్వాసము అత్యంత ప్రధాన మూల కారకం. కేవలం విశ్వాసమేక్కటే ఒక వ్యక్తి కృష్ణచైతన్యములో అభివృద్ధి చెందడానికి తోడ్పడగలదు" అని ప్రభుపాదులవారు చెప్పారు.

ఆధ్యాత్మిక యాజమాన్యమువారు తమపై ఆధారపడినవారి యొక్క విశ్వాసము, పవిత్ర భక్తియుత సేవ పట్ల, మన సాంప్రదాయం పట్ల, శ్రీల ప్రభుపాదులవారి పట్ల, ఇస్కాన్ పట్ల మరియు ఇస్కాన్‌లోని కార్యనిర్వాహక వర్గము పట్ల పెంపొందేవిధముగా తమ ప్రవర్తన గాని, తమ ప్రచారము గాని ఉండేటట్లు చూచుకోవాలి. అలానే ఆధ్యాత్మిక గురువులు తమ ఆధ్యాత్మిక యాజమాన్యానికి యోగ్యులైన ప్రతినిధులు ఇస్కాన్ కార్యనిర్వాహకులే అని గుర్తించి ఆ కార్యనిర్వాహకుల యొక్క విశ్వాసాన్ని పరిరక్షించి, పెంపొందించే బాధ్యత కూడా తమదేనని గుర్తించాలి. అలాకాక ఆధ్యాత్మిక గురువులు దీనికి భిన్నముగా ప్రవర్తించినట్లైతే అది తోటివారి విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది.

అదేవిధముగా కార్యనిర్వాహక యాజమాన్యము కూడా కార్యనిర్వాహక ప్రచారము, ఆచారము మొదలగునవి చేయునపుడు వాటి ద్వారా ఆధ్యాత్మిక యాజమాన్యం యొక్క నమ్మకం పెరిగేలా, వారి శిష్యుల యొక్క విశ్వాసము బలపడేలా చూచుకోవాలి. కార్యనిర్వాహకులు కనుక తమ పరిధిలోనున్న భక్తుల పట్ల నిజాయితీతో కూడిన పరిరక్షణ చూపించినట్లైతే అపుడు సహజముగానే ఆధ్యాత్మిక గురువులు ఆ యా కార్యనిర్వాహకులకు సేవ చేయమని తమ శిష్యులనకు ప్రోత్సహిస్తారు. అలాకాకుండా కార్యనిర్వాహకులు ఆధ్యాత్మిక సూత్రాలకు విరుద్ధముగా ప్రవర్తించడం, తాము బాధ్యత వహించిన భక్తుల ఆధ్యాత్మికాసక్తులను విబేధించడం వంటివి చేస్తే భక్తుల విశ్వాసములు దారుణముగా దెబ్బతింటాయి. అందుచేత ఇస్కాన్‌లోని సభ్యులందరి యొక్క విశ్వాసాన్ని రక్షించే నిమిత్తం ఈ రెండు విధాలైన యాజమాన్యాలకు స్పష్టమైన దిశానిర్దేశము చేయడం అవసరము.

## ఆధ్యాత్మిక గురువులు స్వతంత్రులు కారు :

ఈ యజమాన్యము నడుమ దిశానిర్దేశ సూత్రాలను మరింత విశదీకరించడానికి గాను ఇస్కాన్‌లోనున్న కార్యనిర్వాహక వ్యవస్థలో ఆధ్యాత్మిక గురువుల యొక్క స్థితిని పరిశీలిద్దాం.

శ్రీల ప్రభుపాదులవారు ప్రత్యక్షముగా నున్నప్పుడు ఇస్కాన్‌లో వారే ఏకైక ఆధ్యాత్మిక గురువు, ప్రధాన శిక్షాగురువు మరియు ఏకైక పరమ కార్యనిర్వాహక యాజమాన్యముగా ఉంటూ జి.బి.సి కి ఆధిపత్యము వహించారు.

"మేము మా కృష్ణచైతన్యోద్యమాన్ని సంయుక్త కార్యాచరణ సమితి(జి.బి.సి) ద్వారా నిర్వహిస్తున్నాము. దాదాపు ఇరవై మంది జి.బి.సి సభ్యులు ప్రపంచ వ్యాప్త వ్యవహారాలు పర్యవేక్షించగా వారిపై నేను అధిపత్యమును కలిగియుంటాను. ఈ జి.బి.సి సభ్యులకు దిగువన ప్రతి మందిరము నందు ఒక మందిరాధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి ఉంటారు. ఈ విధముగా మందిరాధ్యక్షునికి జి.బి.సి బాధ్యత వహించియుండగా, జి.బి.సికి నేను బాధ్యత వహిస్తాను. ఈ విధముగా మేము కార్యనిర్వాహణ చేస్తాము" (నూతన వృందావనములో జూన్ **30, 1976** తేదీన వాసుదేవ్‌కు వ్రాసిన ఉత్తరం).

శ్రీల ప్రభుపాదులవారి ప్రత్యక్ష సమక్షము మన మధ్యన లేనందు వలన ప్రస్తుతమున్న వ్యవస్థీకరణ కొంచెం భిన్నముగా నుంటుంది. ఇస్కాన్‌కి సర్వోత్కృష్ట యాజమాన్యము జి.బి.సి అని శ్రీల ప్రభుపాదులవారు ఆనాడే ఆదేశించారు. అదేసమయంలో కృష్ణచైతన్య సంఘానికి పలువురు ఆధ్యాత్మిక గురువులు కావాలని కూడా సూచించారు.

"ఒక ప్రామాణికమైన ఆధ్యాత్మిక గురువు ఆధ్వర్యములో నుంటూ చైతన్య మహాప్రభువును అనుసరించే వారెవరైనా సరే ఆధ్యాత్మిక గురువు కావడానికి అర్హులైయున్నారు. కనుక నేను కోరుకొనేదేమనగా నా తరువాత నా శిష్యులందరూ కూడా కృష్ణచైతన్యాన్ని యావత్ ప్రపంచమంతా ప్రచారం చేసే నిమిత్తం ప్రామాణిక గురువులుగా కావాలని నేను కోరుకొంటున్నాను" (నవద్వీపులో నవంబర్ **2, 1967** తేదీన మధుసూదనకు వ్రాసిన ఉత్తరం).

ఇక్కడే మనకు అసలైన సవాలు ఎదురైంది. ఎందుకనగా అనేక ఆధ్యాత్మిక సంస్థలలో ఒక్క వ్యక్తే ఆధ్యాత్మిక గురువుగా మరియు ఆ సంస్థ యొక్క సర్వాధిపతిగా వ్యవరిస్తాడు. కాని ఇస్కాన్‌లో చూచినట్లైతే ఒకే సంస్థలో పలువురు ఆధ్యాత్మిక గురువులు ఉండగా, మరొక ప్రక్క జి.బి.సి యావత్ సంస్థకంతటికి కార్యనిర్వాహక యాజమాన్యముగా పనిచేస్తుంది. ఈ విధముగా ఇస్కాన్‌లో ఆధ్యాత్మిక గురువులుగా సేవచేసేవారు శ్రీల ప్రభుపాదులవారి సూచనలనుసరిస్తూ సంపూర్ణ జి.బి.సి యొక్క ఆధిపత్యములో సేవ చేయవలసి ఉంటుంది.

అంతేగాక సంఘసిద్ధాంతాలకు, సూత్రాలకు కట్టుబడి జి.బి.సి వారు ఆమోదించిన సిద్ధాంతాలననుసరిస్తూ వారి తీసుకొన్న నిర్ణయాలను గౌరవించాలి. మరొక అదనపు బాధ్యతేమనగా ఆధ్యాత్మిక గురువులు తమ శిష్యులు వారి వారి స్థానిక ప్రదేశాలలో అప్పటికే ఏర్పడియున్న కార్యనిర్వాహక యాజమాన్యమునకు సహాయముచేయు విధముగా చూచుకోవాలి. అలానే ప్రాంతీయ భక్త పరిరక్షణ సంఘాలలో తమ శిష్యులు పాల్గొనే విధముగా ప్రోత్సహించాలి. అంతేగాని శిష్యులు కేవలం తమతో మాత్రమే సాంగత్యం చేసేటట్లు గాని లేక తమ స్వంత ప్రణాళికలకు (ఇస్కాన్ కార్యనిర్వాహక వ్యవస్థతో ఏ మాత్రం సంబంధం లేనివి) మాత్రమే చేయూతనిచ్చేటట్లు గాని చేయరాదు.

## శిష్యులు తమ యాజమాన్యాల మధ్య విభేదమును సృష్టించరాదు :

శిష్యులు ఇస్కాన్ పట్ల విశాలమైన దృక్పదముతో కూడిన అవగాహన కలిగియుండాలి. ప్రాంతీయ జి.బి.సి సభ్యుని కన్నా, స్థానిక ఇస్కాన్ కార్యనిర్వాహకుని కన్నా, వారి ఆధ్యాత్మిక గురువు ఎంతో ఆధ్యాత్మికోన్నతుడే అయియుండవచ్చును(కొన్ని సందర్భాలలో ఆ ఫలానా ఆధ్యాత్మిక గురువు కన్నా ప్రాంతీయ జి.బి.సి సభ్యుడు లేదా స్థానిక ఇస్కాన్ కార్యనిర్వాహకుడే ఆధ్యాత్మికోన్నతుడై ఉండవచ్చును).

ఏదేమైనప్పటికీ కూడా ఇస్కాన్ సంస్థను ఆధ్యాత్మికముగా నిర్వహించడానికిగాను ఇంతక ముందు చెప్పిన విధముగా శ్రీల ప్రభుపాదులవారు సంపూర్ణ అధికారాన్ని జి.బి.సి మండలికి, అందలి సభ్యులకు మరియు ఇతర ఇస్కాన్ కార్యనిర్వాహకులకు అప్పగించారు.

ఒకవేళ  శిష్యుడు పొరపాటున తమ ఆధ్యాత్మిక గురువు జి.బి.సి మండలికి, ఇస్కాన్ నియమనిబంధనలకు అతీతుడని భావించినట్లైతే వెంటనే దానిని ఆ ఆధ్యాత్మిక గురువుగాని లేక ఇతర యాజమాన్యము వారు గాని సరిదిద్ధవలెను. అట్లు చేయనట్లైతే , ఆ అపార్థము చివరకు కార్యరూపము దాల్చి ఆ శిష్యుని యొక్క ఆధ్యాత్మిక మరియు కార్యనిర్వాహక యాజమాన్యాల మధ్య విబేధాలకు దారితీస్తుంది.

వాస్తవానికి ఇస్కాన్‌లోని సమస్త దీక్షా గురువులు, శిక్షా గురువులు ఏ విధముగా వారి యాజమాన్యాన్ని అనుసరిస్తారో అదేవిధముగా వారి వారి శిష్యులందరూ వారికి కేటాయించిన ఇస్కాన్ యాజమాన్యాన్ని అనుసరించాలి.

కనుక ఆధ్యాత్మిక గురువులందరూ (దీక్షా గురువులు, శిక్షా గురువులు) తమ ఆచార ప్రచారాల ద్వారా తమ శిష్యులకు భక్తిలో అభివృద్దిచెందే శిక్షణా బోధనలివ్వడం మాత్రమే కాకుండా ఇస్కాన్ కార్యనిర్వాహణ వ్యవస్థతో తమకున్న సంబంధాన్ని అవగాహనకు తీసుకొనిరావాలి.

# ప్రవేశపెట్టబడిన సూత్రాలు

## శిష్యులు నేర్చుకొనవలసినవి :

ఇస్కాన్‌లోనుండే ప్రతి ఆధ్యాత్మిక గురువు ఈ క్రింది విషయాలను గురించి తమ శిష్యులకు స్పష్టమైన అవగాహన కలిగించుటలో బాధ్యత వహించియున్నాడు.

**1.** ప్రతి ఆధ్యాత్మిక గురువు తను ప్రభుపాదులవారి పట్ల కలిగియున్న విధేయత నుండి తన ప్రామాణికతను, యాజమాన్యాన్ని పొందుతున్నాడు. అయితే ఆ విధేయతలో భాగముగా ఆయన ఇస్కాన్ ఉద్యమములోనే సేవ చేయాలనే ప్రభుపాదులవారి ఆజ్ఞకు కూడా బద్ధుడైయుండాలి.

**2.** ఆధ్యాత్మిక గురువు కూడా ఇస్కాన్‌లో ఒక సభ్యుడు కనుక జి.బి.సి మండలికి, దాని నాయకత్వమునకు బాధ్యుడైయుండవలెను.

**3.** ఆధ్యాత్మిక గురువుకి తాను గురువైనంత మాత్రాన ఇస్కాన్‌లోని ఏ వనరులపైన స్వతంత్ర హక్కును గాని, ఆధిపత్యమును గాని కలిగియుండడు. విశదముగా చెప్పాలంచే ఆధ్యాత్మిక గురువు తన హక్కులను మరియు శిష్యులపై తమకుండే అధికారాలను దుర్వినియోగపరచరాదు.

**4.** సమస్త ఆధ్యాత్మిక గురువులు (దీక్షా గురువులు, శిక్షా గురువులు) తమకు కేటాయించిన ఇస్కాన్ యాజమాన్యమునకు ఏలా అనుసరించాలో ఆదర్శప్రాయముగా చూపినట్లైతే తద్వారా వారి శిష్యులందరూ తమకు నిర్ధేశించిన ఇస్కాన్ యాజమాన్యాన్ని చక్కగా అనుసరించగలుగుతారు.

**5.** ఆధ్యాత్మిక గురువు ద్వారా కృష్ణునికి శరణాగతి పొందాలనే ప్రధాన లక్ష్యాన్ని శిష్యులు కలిగియున్నప్పటికీ అదే లక్ష్యములో భాగముగా తమ ఆధ్యాత్మికాభివృద్ధికి సహాయము చేయుచున్న ఇస్కాన్ కార్యనిర్వాహక వ్యవస్థలోని పెద్దలందరినీ గుర్తించి గౌరవించాలి.

**6.** ఒక్కొక్కసారి ఆధ్యాత్మిక పరిపక్వత చెందిన కార్యనిర్వాహకులు తమ పరిధిలోనున్న భక్తులకు ప్రధాన శిక్షా గురువుగా వ్యవహరిస్తుంటారు. అటువంటపుడు అట్టి సంబంధాలను దీక్షా గురువులు సంపూర్ణముగా ప్రోత్సహించవలెను.

## ఆధ్యాత్మిక గురువులకు సూచనలు :

కార్యనిర్వాహక యాజమాన్యము పట్ల గౌరవాన్ని చూపడానికి, ఆధ్యాత్మిక యాజమాన్యము పట్ల కార్యనిర్వాహకులు కలిగియున్న విశ్వాసమును పరిరక్షించి ప్రోత్సహించడానికి ప్రతి ఆధ్యాత్మిక గురువు ఈ క్రింది సూచనలను పాటించాలి.

**1.** ఏదైనా ఒక ఇస్కాన్ మందిరానికి గాని లేదా ప్రచార కేంద్రానికి గాని ఎవరైనా ఆధ్యాత్మిక గురువు మొదటిసారిగా సందర్శించడానికి గాని లేక యాత్ర పేరుతో చూడడానికి గాని వెళ్లినపుడు తన స్వంత ప్రణాళికను

ఆ కార్యనిర్వాహకునికి చెప్పకుండా అతని సౌకర్యమును అడిగి తెలుసుకొని, తన సేవలు అతను ఎలా కోరుకుంటున్నాడో తెలుసుకొని సేవించవలెను.

**2.** ఏ మందిరము గాని, ప్రచార కేంద్రము గాని లేని నూతన ప్రదేశానికి వేళ్ళేముందు ఆ సంబంధిత ప్రాంతీయ జి.బి.సి సభ్యుని సంప్రదించి అచట స్థానిక నాయకులెవరైనా ఉన్నారో తెలుసుకొని తాను అచట సేవించుటకు ప్రయత్నించవలెను.

**3.** కార్యనిర్వాహక నిర్ణయాల వలన ఏవైనా వ్యత్యాసాలు వస్తే ఆధ్యాత్మిక గురువులు సాధ్యమైనంత శ్రేష్ఠముగా వారితో సర్ధుకుపోవడానికి ప్రయత్నము చేయాలి. అట్లు ఒక ఒప్పందానికి రానట్టైతే అపుడు ఆధ్యాత్మిక గురువు కార్యనిర్వాహకుల నిర్ణయాన్ని విభేదిస్తూ వారి ఉన్నత యాజమాన్యానికి సమస్యను నివేదించాలి.

## <u>కార్యనిర్వాకుల బాధ్యతలు</u> :

ఇస్కాన్‌లో పరస్పర సహకారమును పెంచుటకు, ఆధ్యాత్మిక యాజమాన్యమును గౌరవించుటకు, కార్యనిర్వాహక యాజమాన్యము పట్ల ఆధ్యాత్మిక గురువులకు మరియు శిష్యులకు గౌరవ విశ్వాసాలు పరిరక్షించి పోషించుటకు గాను ఇస్కాన్‌లోని ప్రతి కార్యనిర్వాహకుడు ఈ క్రింది సూచనలను తప్పనిసరిగా అనుసరించవలెను.

**1.** ప్రతి కార్యనిర్వాహకుడు కూడా దీక్షా గురువులు, తమ పరిధిలోనున్న ప్రాంతాన్ని సందర్శిస్తున్న సంచార ప్రచారకులు చెప్పే సూచనలను స్వీకరించవలెను. ప్రత్యేకించి భక్తుల పరిరక్షణ విషయములో వారిచ్చే సూచనలు, సలహాలు ఖచ్చితముగా స్వీకరించవలెను.

**2.** తమపై ఆధారపడినవారి యొక్క విశ్వాసాన్ని పవిత్ర భక్తియుత సేవ పట్ల, దీక్షా మరియు శిక్షా గురువులను స్వీకరించే విధానము పట్ల పెంపొందించే విధముగా సంరక్షించాలి.

**3.** తమ కార్యనిర్వాహణ పరిధిలోని 'భక్త పరిరక్షణ' పద్ధతిని ప్రోత్సహించి మద్ధతునివ్వాలి (సలహాధారుల సంఘం, బ్రాహ్మణ సలహా సంఘాలు మొదలగునవి).

**4.** కార్యనిర్వాహకులు తమ పరిధిలోనున్న కార్యనిర్వాహక వర్గమంతా భక్తులను ఏలా పరిరక్షించాలో తెలియజేసే సూత్రాలలో, పద్ధతిలో శిక్షణ పొందే విధముగా చూచుకోవాలి.

**5.** మందిరాన్ని సందర్శించే ఆధ్యాత్మిక గురువులకు వారి వారి శిష్యుల యొక్క ఆధ్యాత్మిక స్థితిగతులను గూర్చి, కృష్ణచైతన్యాభ్యాసము గూర్చి, మొత్తం నడవడికను గూర్చి సమగ్ర సమాచారాన్ని అందించాలి.

**6.** మందిరానికి సందర్శించడానికి వచ్చే ఆధ్యాత్మిక గురువులను, సంచార ప్రచారకులను ప్రోత్సహిస్తూ, వారి శిష్యులకు లేదా వారి సహాయాన్ని ఆశించేవారికి వారు అందుబాటులో ఉండేలా చేయాలి.

**7.** దీక్షా సిపార్సులకు సమానత్వ పద్ధతిని ఏర్పాటు చేయాలి. ఆ పద్ధతి కార్యనిర్వాహక లాభాలు కోసం స్థానిక కార్యనిర్వాహకుల నుండి ఏర్పడే అనవసరమైన ఒత్తిడిని తగ్గిస్తుంది.

## సారాంశము :

భక్తుల ఆధ్యాత్మిక జీవితాలను సంపూర్ణముగా వికసింపజేయడానికి ప్రభుపాదులవారు ఇస్కాన్‌లో ఒక క్రమనిర్దిష్టమైన కార్యనిర్వాహక వ్యవస్థను ఏర్పాటు చేశారు. కనుక ప్రతి ఇస్కాన్ సభ్యుడు కూడా ఆ వ్యవస్థను గౌరవించి, ఆ వ్యవస్థలోపల పనిచేయడం నేర్చుకోవాలి. కార్యనిర్వాహక వ్యవస్థ ముఖ్య లక్ష్యం ఆధ్యాత్మికమే. అదేమనగా ఇస్కాన్ సభ్యులందరికీ భక్తుల సాంగత్యం, సేవా భాగ్యము, ప్రచారవకాశము కల్పించడం ద్వారా అధ్యాత్మికాభివృద్ధిని సాధించడం. అదేసమయములో ఇస్కాన్ తమ సభ్యులందరికీ ప్రామాణిక ఆధ్యాత్మిక గురువును స్వీకరించుట యొక్క ప్రాధాన్యతను కూడా తెలియజేస్తుంది.

ప్రాధాన్యత రీత్యా గమనిస్తే ఇస్కాన్‌లో శ్రీల ప్రభుపాదుల వారు సంస్థాపకాచార్యునిగా, పలువురు ఉన్నత భక్తులకు ఆధ్యాత్మిక దీక్షా గురువుగా, ఇస్కాన్‌లోనున్న ప్రతి భక్తునికి ప్రధాన శిక్షా గురువుగా ఇప్పటికీ, ఎప్పటికీ శాశ్వత స్థానాన్ని కలిగియున్నారు. అలానే మరొక ముఖ్యాంశము ప్రస్తుతం ఇస్కాన్‌లో కూడా పలువురు దీక్షా గురువులు, శిక్షా గురువులు ఉన్నారు.

సమస్త ఆధ్యాత్మిక గురువులు మరియు వారి శిష్యులు సహృదయముతో మన సంస్థలో కార్యనిర్వాకుల ప్రాధాన్యతను గుర్తించి శిష్యులకు శిక్షణ, రక్షణనివ్వడంలో, వారి ఆధ్యాత్మికాభివృద్ధికి ఇస్కాన్ అందజేస్తున్న అవకాశాలను వారి చేతికందివ్వడంలోను కార్యనిర్వాహకుల అవసరము ఎంతో ఉందని గమనించి వారిని ప్రశంసించాలి. అలానే గురుశిష్యులందరూ ఇస్కాన్ కార్యనిర్వాహక వ్యవస్థతో(వ్యవస్థలో) పరస్పర సహకార భావము కలిగియుండడం ద్వారా తమకు తాము ఆధ్యాత్మిక ప్రయోజనాన్ని పొందుతూ, మరొక వైపు సంస్థ అభివృద్ధికి తోడ్పడినట్లు అవుతుంది.

ఈ పరస్పర సహకార భావనాస్ఫూర్తి యనునది మన సంస్థ ఐకమత్యాన్ని భద్రపరచడానికి, ప్రభుపాదులవారిని ప్రసన్నము చేయడానికి, సంకీర్తనోద్యమాన్ని వ్యాపింపజేయడానికి శ్రేష్ఠ సాధనముగా ఉపయోగపడుతుంది.

శ్రీ చైతన్య మహాప్రభువు మనోభీష్టాన్ని అనుసరించి "ప్రతి నగర గ్రామము నందు" అను నినాధముతో సంకీర్తనోద్యమాన్ని యావత్ ప్రపంచమంతట విస్తరింపజేయాలనేది శ్రీల ప్రభుపాదులవారి సంకల్పం. వారు తన సంకల్పాన్ని నిరంతర సంచార ప్రచారాల ద్వారా తెలియజేశారు. ప్రపంచమంతటా నూతన మందిరాలు స్థాపించమని, పుస్తక వితరణ చేయమని, ఆకర్షణీయమైన భారీ ఉత్సవాలు నిర్వహించమని, పెద్ద ఎత్తున ప్రసాదాలు పంచపెట్టమని ప్రభుపాదులవారు తమ శిష్యులకు ఆదేశించారు. మరి ఆ ప్రభుపాదుల వారి సంకల్పము వలననే నాటి నుండి నేటి వరకు ఇస్కాన్ దినదినాభివృద్ధి చెందుతూ చైతన్యచంద్రుని కరుణాకిరణాలవలె ఉదయిస్తూ ఉంది.

ఈ ప్రయోజనము కోసమే శ్రీల ప్రభుపాదులవారు ఇస్కాన్‌ను ఒక కార్యనిర్వాహక వ్యవస్థతో కూడిన ఆధ్యాత్మిక సంస్థగా రూపొందించారు. ఈ కార్యనిర్వాహక ప్రయోజనమేమనగా వారు సంస్థాపించిన ప్రమాణాలను పోషించి కొనసాగించుట, భక్తులకు ఆధ్యాత్మిక రక్షణ, పోషణ కలిగించుట మరియు సంకీర్తనోద్యమాన్ని వృద్ధిచేయుట మొదలగునవి. ఈ విధముగా బద్ధజీవులకు శ్రీశ్రీగౌరనితాయిల కృపను అందించడం ద్వారా శ్రీల ప్రభుపాదుల వారిని సంతృప్తిపరచాలంటే ఇస్కాన్‌లోనున్న ప్రతిఒక్కరు కూడా అనగా ఆధ్యాత్మిక గురువులు, శిష్యులు, కార్యనిర్వాహకులు మొదలగు వాగందరూ వ్యవస్థలోనే ఉంటూ ఒకరికొకరు పరస్పర సహకార భావనతో కృషిచేయాలి.